# అల్లరి కథ

"బాగుంది. బాగుంది. బాగుంది. చాలా బాగుంది" అన్నాడు చక్రపాణి సంబరంగా.

"నిజంగానా?" అన్నాడు కపిలేశ్వర్ ఆనందంగా.

"ఒట్టు..తల్లి తోడు... మదర్ ప్రామిస్" అన్నాడు. చక్రపాణి తల మీద చెయ్యి ఉంచుకుంటూ.

అతనలా అంటుంటే అతనికేసి భగవంతుడు భక్తుడి వంక చూసినట్టుగా చూశాడు కపిలేశ్వర్.

"నిజంగా అంత బాగుందా?" అన్నాడు మళ్లీ చూడ్డం అయ్యాక!

"రియల్లీ వండ్రఫుల్... అద్భుతం... అత్యద్భుతం..." అన్నాడు. చక్ర పాణి... మరింత సంబరంగా!

"నీకు అంతగా నచ్చిందేమిటీ? భాషా? భావమా? శ్రావ్యమైన నా గొంతా?" అడిగాడు కపిలేశ్వర్.

"మూడూనూ"

దాంతో కపిలేశ్వర్ ఇంక తనని తాను కంట్రోల్ చేసుకోలేక పోయాడు. "ఇన్నాళ్లకి నా కవిత్వంలోని ఇంపునీ, సొంపునీ, సొగసునీ జీర్ణించుకోగలిగిన ఒక శ్రోతవి దొరికావ్ గురూ" అన్నాడు చక్రపాణిని గట్టిగా కౌగిలించుకుంటూ.

"వొదులు... ఎవరన్నా చూస్తే బాగుండదు.." అన్నాడు చక్ర పాణి ఒకింత బిడియంగా.

'అమ్మో నిన్నొదులుతానా?' అని మనసులో అనుకుని చక్రపా ణిని వదిలేశాడు కపిలేశ్వర్.

"ఇంకోటి వినిపించనా?"

"విత్ ప్లెజర్...నా అదృష్టం..."

***

"బాగుంది. బాగుంది. బాగుంది. చాలా బాగుంది..." అన్నాడు చక్రపాణి సంబరంగా.

"నిజంగానా?" అన్నాడు కపిలేశ్వర్ ఆనందంగా.

"ఒట్టు..తల్లితోడు... మదర్ ప్రామిస్..." అన్నాడు.

చక్రపాణి తలమీద చెయ్యి ఉంచుకుంటూ.

అతనలా అంటుంటే అతనికేసి భగవంతుడు భక్తుడి వంక చూసినట్టుగా, చూశాడు కపిలేశ్వర్.

(రాసిందే రాశాడనుకోకండి - మర్నాడు కూడా అచ్చం అలాగే జరిగిందన్నమాట).

***

"బాగుంది. బాగుంది. బాగుంది. చాలా బాగుంది..." అన్నాడు చక్రపాణి సంబరంగా.

ఆ మర్నాడు కూడా అచ్చం అలాగే జరిగి అటుపిమ్మట ఇంకో అయిదారు రోజుల పాటు కూడా అలాగే జరిగాక.

"చాలా థాంక్స్ గురూ!" అన్నాడు చక్రపాణి కపిలేశ్వర్‌తో.



"అదేమిటీ? నేనే నీకు థాంక్స్ చెప్పాలి.. వారం రోజుల్నుంచి ఎంతో ఓపిగ్గా నా కవిత లన్నీ అడిగి మరీ వింటున్నందుకు" అన్నాడు కపిలేశ్వర్.

"కాదు.. నేనే నీకు థాంక్స్ చెప్పాలి" అన్నాడు చక్రపాణి అతని మాటల్ని ఖండిస్తూ.

"దేనికీ?" అడిగాడు కపిలేశ్వర్ కొంచెం ఆశ్చర్యంగా.

'ఒకవేళ కొంపదీసి నిజంగానే నా కవితలు గానీ బాగు న్నాయా ఏమిటి?' అనుకున్నాడు మనసులో అబ్బురంగా.

"మా గుత్తి గుర్నాథం అంకుల్ నీకు తెలుసు కదా?"

"భలేవాడివే! ఎందుకు తెలీదూ?" అన్నాడు.

కపి - సంభాషణ ఎటో పోతోందేమిటి చెప్మా - అనుకుంటూ !

"ఆయనొక భార్యా బాధితుడని నీకు తెలుసా?"

"తెలుసు - ఒకట్రెండుసార్లు నా దగ్గర కూడా వాపోయాడు. నేరకపోయి పెళ్లి చేసుకున్నానోయ్ - ఇంకెప్పుడూ చచ్చినా చేసుకోనని.."

"పరాయివాడివైన నీ దగ్గరే అలా వాపోయినవాడు సొంత మనిషినైన నా దగ్గరెలా వాపోయి ఉంటాడో ఇంక వేరే చెప్పాలా?"

"అఫ్‌కోర్స్. ఇంతకీ నువ్ చెప్పేదేమిటి?"

"ఏం లేదు. భార్యా బాధితుడైన మా గుత్తంకుల్ పెళ్లి చేసు కోకురా ఆ బాధలు నువ్ భరించలేవు" అంటూ ఎన్నాళ్లుగానో నన్ను భయపెడుతూ వస్తున్నాడు. కానీ పెళ్లి చేసుకోకుండా నేనెలా ఉండగలను? అందుకే..." అంటూ నీళ్లు నమిలాడు చక్ర పాణి విషయాన్ని ఎలా చెప్పాలో అర్థంగాక.

"ఊ అందుకే..." కుతూహలంగా అడిగాడు కపి.

"అందుకే... వారం రోజుల్నుండి నీ కవితల్ని అడిగి మరీ విని పించుకున్నాను. నీ కవితల పుణ్యమాని నాలో ఇప్పుడు విషాన్ని కూడా హరించుకోగల 'శక్తి' ఏర్పడిపోయింది. సో... నేనిపుడు జీవితంలో పెళ్లికే కాదు.. ఇంక దేనికీ భయపడాల్సిన పని లేదు. నాకు అంతటి 'శక్తి' నీ కవితల వల్ల వచ్చేసింది. ఇప్పుడు చెప్ప థాంక్స్ చెప్పాల్సింది నువ్వా? నేనా?" అన్నాడు చక్రపాణి.

సమాధానం చెప్పడానికి కపి స్పృహలో ఉంటేగా!

-పసుపులేటి శివశంకర్ (నెల్లూరు)